# భగవంతుని ఆజ్ఞను శిరసావహించినవాడే దివ్యత్వమును పరిపూర్ణముగా అనుభవించగలడు

**భుక్తి విద్యలన్ని భక్తితో చదివేరు**
**ముక్తి విద్యలకెవరు ముందు రారు**
**ఇట్టివారికి ఈశ్వరత్వంబెట్లుకల్గు**
**వినుడు భారతీయ వీరసుతుడ!**

విద్యార్థులారా!

ప్రపథమమునందే విద్యయొక్క విశిష్టతను సాయినాథ్ చక్కగా జ్ఞాపకం చేశాడు. విద్యార్థులందు సంకుచితమైన భావములున్నవనే సత్యాన్నికూడను తెలియజేశాడు. Sisters and my dear brothers అన్నాడు. My dear sisters and brothers అని ఎందుకు చెప్పి ఉండకూడదు? Sisters and my dear brothers అన్నాడు. ఎంత సంకుచితము! ఈనాటి విద్యావిధానము స్వార్థముతో, స్వప్రయోజనముతోకూడి ఉంటున్నది. విద్యార్థుల చదువుసంధ్యలు ప్రారంభముకాగానే అహంకారము, ఆడంబరము, మోహము వారిలో విద్యకంటే ముందుగానే ప్రవేశించి ఉంటాయి. ఇంతటితోపోక దుర్బుద్ధులు, దురాలోచనలు, దుశ్చేష్టలు, దురభిప్రాయములు వారిలో చీమల పుట్టలవలె పుడుతూ ఉంటాయి.

sri sathyasaivacharamrutam

**మానవుడు తనలో పశుగుణములను ప్రవేశపెట్టడంచేత మానవతా విలువలు కనుమరుగైపోతున్నాయి**

నిజముగా యువకులందు, యువతులందు మానవత్వము మరపింపచేసే అష్టమదములు, అరిషడ్వర్గములు, తమోగుణ, రజోగుణములు యివన్నీచేరి పదహారు కళలుగా రూపొందుతాయి. ఈ షోడశకళలతో నిండి ఉంటున్నారు, యీనాటి యువకులందరు. ధనమదము, గుణమదము, భుజబలము, బుద్ధిబలము, సంపదబలము, విద్యాబలము, కులబలము మొదలయినవన్నీ బలములు కావు. ఈనాడు మానవునియందుండవలసిన పవిత్రమైన, దివ్యమైన షోడశకళలు మరుగుపడిపోతున్నాయి. భగవంతుడు షోడశకళాపరిపూర్ణుడు. అష్టమదములు, అరిషడ్వర్గములు ఇవి షోడశకళలు కాదు. వీటిని ఏనాడు విద్యార్థి దూరముగావించునో ఆనాడే యితను భగవత్సంబంధమైన షోడశకళలతో ప్రకాశిస్తాడు. మానవునియొక్క ప్రధానగుణములు కామక్రోధలోభ మోహమదమత్సరములు కావు. ఇవి కేవలము మృగలక్షణములు. పశులక్షణములు. మానవుని లక్షణములు, మానవుని గుణములు, మానవుని విలువలు సత్యము, ధర్మము, శాంతి, ప్రేమ, సహనము, సానుభూతి. ఈనాటి మానవుడు పశుగుణములను ప్రవేశపెట్టుకోటంచేత మానవతావిలువలు మరుగైపోతున్నవి. కనుక, ఈనాటి విద్యావిధానములో మానవతావిలువలు పైకి తేవటానికి ప్రయత్నించాలి. యవ్వనము మధ్యలో కదలిపోయేది. కదలిపోయే మేఘములవంటిది. ఈ క్షణికమైన యవ్వనముకొరకు అనంతమైన దివ్యత్వమును ఏవిధంగా పాడుచేసుకుంటున్నారు! కాన ప్రతి యువకుడు దివ్యమైన భావములు అభివృద్ధి గావించుకోవాలి. ధనము కేవలం వస్తుంది, పోతుంది.

**ధనమున్నదని ఘనముగా పలికిన**<br>
**పుడమియందిసుమంత శాంతిలేదు**<br>
**విద్యఉన్నదని విఱ్ఱవీగిన**<br>
**పుడమియందిసుమంత శాంతిలేదు**

ఏమిటి ఈ శాంతిలేని విద్యలు? శాంతిలేని ధనము మనకెందుకు? ధనము ఏది? జ్ఞానధనము. ఐశ్వర్యము ఏమిటి? ఆరోగ్యమనే ఐశ్వర్యము. మన సంపద ఏమిటి? పరిపూర్ణమైన స్వేచ్ఛా సంపద. ఏమిటీ స్వేచ్ఛ?

## ఆత్మధర్మమే స్వధర్మము

ఈనాటి విద్యావంతులలో 'యిష్టానుసారంగా మాట్లాడవచ్చు, ఇష్టము వచ్చినట్లు సంచరించవచ్చు, ఇష్టము వచ్చినట్లు ప్రవర్తించవచ్చు, ఇష్టమువచ్చిన కార్యములు చేయవచ్చు' అనే భావన పెరిగిపోయింది. ఇది 'స్వేచ్ఛ' అంటున్నారు. ఇదికాదు, స్వేచ్ఛ. ఆత్మనిగ్రహమే స్వేచ్ఛ. ఆత్మానందమే స్వేచ్ఛ. ఆత్మజ్ఞానమే స్వేచ్ఛ. ఆత్మవికాసమే స్వేచ్ఛ. దీనికి ఎట్లా అర్థం చెప్పవచ్చు. స్వ+ఇచ్ఛ=స్వేచ్ఛ. స్వ-ఆత్మ, ఇచ్ఛ-కోరిక. ఆత్మకోరిక స్వేచ్ఛ. ఈనాటి విద్యార్థులుగానీ యువకులుగానీ ఆత్మవరకు ప్రయాణం చేయటంలేదు. కేవలం దేహమునకు సంబంధించిన స్వేచ్ఛను మాత్రమే అనుభవిస్తున్నారు. భగవద్గీతయందుకూడా స్వధర్మ, పరధర్మ అని రెండు బోధలు చేశాడు, కృష్ణ పరమాత్మ. ఈనాడు స్వధర్మమనగా క్షత్రియుడు క్షత్రియధర్మము, బ్రాహ్మణుడు బ్రాహ్మణధర్మము, శూద్రుడు శూద్రధర్మము అని ఈ విధంగా జాతిమతకులభేదములకు సంబంధించిన ధర్మములుగా ప్రబోధిస్తూ ఉన్నారు. అదికాదు. స్వ-ఆత్మ ధర్మము. ఆత్మధర్మమే స్వధర్మము. పరధర్మమనగా దేహధర్మము. దేహము జడమైనది. దీనియందు మనస్సే ప్రేరేపణ సల్పి అనేక కర్మలను ఆచరింపచేస్తుంది. మన స్వేచ్ఛ యిదికాదు. సమాజములో గౌరవము సాధించే ప్రవర్తనయే మన స్వేచ్ఛ. సమాజములో 'సై' అనిపించుకునే స్వేచ్ఛయే సరియైన స్వేచ్ఛ. ఆత్మజ్ఞానమే సరియైన స్వేచ్ఛ. ఇంద్రియ నిగ్రహమే సరియైన స్వేచ్ఛ. దీనినే పతంజలి 'యోగఃచిత్తవృత్తి నిరోధకః' అని నిర్వచించాడు. అదే యోగము. 'ఎంత యోగములో పుట్టావు', అంటారు. అనగా 'ఎంత అదృష్టవంతుడవోయి' అని అర్థము. అలాంటి అదృష్టవంతుని భగవంతుడు కోరివస్తుంటాడు.

## నిజమైన భక్తుని భగవంతుడే వెతుక్కుంటూ వస్తాడు

భగవంతుని దగ్గరకు నీవు పోనక్కరలేదు. భగవంతుడే నీ దగ్గరకు వస్తుంటాడు.

srisathyasaivachanamrutam

భగవంతుని మనం పిలువనక్కరలేదు. పరమభక్తుడైన త్యాగరాజు

**రారా మాయింటిదాక**
**రఘువీర సుకుమార నేమ్రొక్కెద**
**రారా మాయింటిదాక**

అని పిల్చాడు. అంతేకాదు

**రారా దశరథకుమారా నన్నేలుకోరా**
**నే తాళలేర రారా మాయింటిదాక**

అనికూడా వేడుకున్నాడు. కానీ, యిది నిజంగా భక్తుడు పిలువవలసిందికాదు. తనలో ఏదో దోషముంటేనే భక్తుడు అలా భగవంతుని పిలుస్తాడు. భగవంతుడే నిన్ను పిలవాలి. 'Come on! my dear!' అని పిలవాలి. ఎప్పుడు పిలుస్తాడు? 'కరిష్యే వచనం తవ' అని అర్జునుడు అన్న తరువాత, 'ఓ కృష్ణా! నీ ఆజ్ఞ శిరసావహించి నా జీవితమంతా నీ ఆజ్ఞలో లీనమైపోతాను',. అని వాగ్దానము యిచ్చిన తరువాత, 'మన్మనా భవ మద్భక్తో...'. 'ఇప్పుడు నీవు నావాడురా come on' అన్నాడు. ఆ విధముగా అర్పితము గావించిన మరుక్షణములోనే భగవంతుడు నిన్ను చేర్చుకుంటాడు. అత్యంత సమీపుడౌతాడు. కానీ మానవుడు ఈ పవిత్రమైన మానవతావిలువలను గుర్తించుకోలేకపోతున్నాడు. 'ఈ దుర్భావములు నావి కావు. ఇవి కేవలము మృగభావములు. 'నేను మానవుడను, మాధవునినుండి పుట్టినవాడను' అనే భావములు మానవునికి రావాలి. మాధవునినుండి పుట్టిన మానవునికి ఈ మురుగుబుద్ధులంతా ఎందుకు వచ్చాయి? సంగదోషమే దీనికి మూలకారణము. కనుక, మనము దుష్టసంగమునుంచి దూరముకావాలి.

**అణువుమొదలు ఘనమువరకు సర్వమూ భగవంతుడే!**

విద్యార్థులందు పవిత్రమైన భావములు, పరిశుద్ధమైన భావములు, నిర్మలమైన భావములు, నిస్వార్థమైన భావములు పెరగాలి. ఒక్క చిన్న ఉదాహరణము. మీరు చక్కగా గుర్తించుకోండి. భగవంతుడు సర్వము సృష్టించాడు. అణువుమొదలు ఘనమువరకు

sri sathyasai vahini amrutam

భగవంతుని సృష్టియే! అలాంటి భగవంతుని కనుగొనుటకు సాధ్యముకాదు. అయితే ప్రతి అణువు ఘనముగానే భావించాలి. ప్రతిఘనము అణువుగానే విశ్వసించాలి. ఉద్ధవుడు చెప్పాడు

**నిను కనుగొనగలమా కృష్ణా! నిను కనుగొనగలమా!**
**అణువుకంటె అతి సూక్ష్మరూపుడవు**
**ఘనముకంటె అతి గణనీయుడవు**
**ఎనుబదినాలుగు లక్ష జీవముల**
**అనయమ్మును నెడబాయకుందువట**
**అణురేణువు తృణకాష్ఠము మొదలుగ**
**అఖండ రూపుడవై వెలయుదువట**

ప్రతి అణువునందు ఉండేవాడు భగవంతుడే! ఎందుకోసం యిచ్చాడు, ఈ ప్రపంచమును? 'ఓ మానవులారా! ఓ దివ్యజీవులారా! ఇదుగో ఈ ప్రపంచములో సమస్తము మీ కొరకు సృషించాను. మానవునికి తెల్లవారి లేచినది మొదలు రాత్రి పరుండినంతవరకు ఏఏ పదార్థములు ఎప్పుడెప్పుడు ఎక్కడెక్కడ ఎట్లా అనుభవించాలో అనే దానికి తగిన సామాగ్రినంతా సృష్టించాను. త్రాగటానికి నీరు యిచ్చాను. చల్లదనమునకు గాలి యిచ్చాను. పంచభూతములను మీ కోసమే సృష్టించాను. మీ యిష్టానుసారము అనుభవించుకోండి. స్వేచ్ఛ మీకే యిచ్చాను. ఏ objection లేదు. ఇష్టము వచ్చినట్లు అనుభవించుకోండి', అన్నాడు. ఏ టాక్సులేదు. ఏ సుంకములేదు. ఎంతైనా అనుభవించుకోవచ్చును. కానీ, ఒక కండిషను పెట్టాడు. 'దేనిని మీరు అనుభవిస్తున్నారో దాని ఫలమునుకూడా మీరు అనుభవించాలి' అన్నాడు. చెడ్డచేస్తే చెడ్డఫలితము వస్తుంది. మంచిచేస్తే మంచి ఫలితము వస్తుంది. దీనిని మీరు అందుకొనుటకు సిద్ధంగా ఉండాలి. ఈ విషయములో నేను ఏమాత్రము ప్రవేశించను. మీరు అనుభవించే తీరాలి. ఈ విషయమునే గీతయందు చక్కగా వివరించడం జరిగింది. భగవంతుడు చీకటిని దూరము చేయటానికి లైటు యిచ్చాడు. వేడితో బాధపడేవానికి చల్లని గాలి యిచ్చాడు. మానవుడు అనుకుంటాడు, 'యిది స్వేచ్ఛగా



srisathyasaivachanamrutam

అనుభవించాలి' అని. 'భగవంతుడు గాలినిచ్చి దీపమును ఆర్పివేస్తున్నాడే యిది ఏమి న్యాయము?' అనుకుంటాడు. అయితే అన్నింటికి పురుష ప్రయత్నము నీకు అత్యవసరము. 'గాలి యిచ్చాను, నీ ప్రాణము నిల్పుకోటానికి. వెలుగు యిచ్చాను, నీవు అజ్ఞానమనే చీకటిలో గుంటలోపడి అనేక బాధలకు గురికాకుండా ఉండే నిమిత్తమై జ్యోతిని యిచ్చాను. గాలికి వీచే శక్తిని మాత్రమే యిచ్చాను. దీపానికి వెలిగే శక్తిని మాత్రమే యిచ్చాను. కానీ వీచే గాలి వచ్చి వెలిగే జ్యోతిని ఆర్పివేస్తే నా శక్తికే లోటు కలుగుతుంది'. అదే law of nature. గాలి, గాలిపాటికి వీచవలసిందే! జ్యోతి, జ్యోతిపాటికి వెలగవలసిందే! అయితే పురుష ప్రయత్నము ననుసరించి ఆరిపోకుండా నీవు ఒక గ్లాసును పెట్టుకోవాలి. అదీ పురుష ప్రయత్నము. అది పెట్టుకోకుండా 'ఓ గాలీ! నా దీపము ఆర్పకూడద'ంటే అది తప్పుకాదూ! ప్రకృతికే చాలా విరుద్ధమవుతుంది. భగవంతుడు సృష్టించిన ప్రతిదానికి విరుద్ధమైపోతుంది. దీనికి భగవంతుడు ఏమాత్రము ఒప్పుకోడు. అయితే భక్తుల బాధలు కొంత మితిమీరిపోయినప్పుడు, భక్తుని మతులు మంచిస్థితికి వచ్చినప్పుడు, వారి ప్రార్థనలు హృదయమునుండి ఆవిర్భవించినప్పుడు, భగవంతుడే సాక్షాత్కరించి వారి బాధలు నివారణ గావిస్తాడు.

**భగవంతుడు ఒక్క క్షణములో ఏదైనా చేయవచ్చు**

మీరు భాగవతములో చదివిఉండవచ్చు. ఒకానొక సమయములోపల ఇంద్రుడు గొప్ప వర్షము కురిపించాడు. వర్షం కురవటం సహజము. గోపికలు, గోపాలురు అంతా కృష్ణుని చుట్టుకున్నారు. 'కృష్ణా! మమ్మల్ని రక్షించు! మా గోవులను రక్షించు! బాధలను భరించలేము, జీవించలేము', అని ప్రార్థించారు. అప్పుడు కృష్ణుడు చెప్పాడు, 'వర్షము నిలుపుటకు వీలుకాదు. అది నా సృష్టియే! కురవవలసిందే! అయితే దానిని తప్పించుకొనుటకు ప్రార్థనవల్ల కొన్ని ఉపాయములుంటున్నాయి. నాకు శక్తి ఉన్నది కదా అని దాన్ని నిలుపటానికి వీలుకాదు. అప్పుడు నా శక్తినే నేను ఉల్లంఘించినట్లు అవుతుంది. కనుక, రండి! నేను గోవర్ధన పర్వతము ఎత్తుతాను. దానిక్రింద మీరు దాగి ఉండండి. వర్షమును నిలుపుటకు వీలుకాదు'. ఆ విధంగా కృష్ణుడు గోవర్ధన గిరిని ఎత్తటానికి పోతే, మానవ

sri sathyasai vahamrutam

బుద్ధులననుసరించి గోపాలుర మనస్సులో తక్షణమే సందేహము ప్రారంభమైంది. కృష్ణా! రక్షించమని కోరినవారు కృష్ణుడు గోవర్ధన పర్వతము ఎత్తేటప్పటికి **బాలుండీతడు కొండదొడ్డది మహాభారంబు ఈతండు మోయంగలడా?** అని సందేహములో పడ్డారు. తక్షణమే కృష్ణుడు పర్వతమును ఎత్తాడు, ఒక్క చిటికినవేలుపై. అందరూ వచ్చి దానిక్రింద చేరిపోయారు. వర్షమునుంచి తప్పించుకున్నారు. తమ గోవులను అక్కడ చేర్చుకున్నారు. ఇంతలో తల్లితండ్రులకు ఒక విధమైన భయము ప్రారంభమైంది. యశోదానందులు చాలా భయపడుతున్నారు. 'కొండ ఎత్తటమువరకు సరిపోయింది. దాన్ని క్రిందకు దింపటము ఎట్లా? క్రిందకు దింపే సమయంలో కొండక్రింద మా కృష్ణుడు పడిపోతాడో ఏమో!' అని భయపడినారు. అప్పుడు అందరిని ఒక్కపరి కృష్ణుడు 'నా ఆజ్ఞ మీరు శిరసావహించాలి' అన్నాడు. 'ఎవరు నా ఆజ్ఞ పాటింతురో వారు రక్షింపబడతారు. ఎవరు ఆజ్ఞను ఉల్లంఘిస్తారో వారు హతమైపోతారు. నేను ఓం... అని పలికినప్పుడు అందరు కన్నులు మూసుకోవాలి' అన్నాడు. కృష్ణుడు ప్రారంభించాడు ఓం... కన్నులు మూసుకున్నారు. కొన్ని క్షణాల తరువాత వారందరు కన్నులు తెరిచేటప్పటికి కొండ క్రింద ఉంది, కృష్ణుడు వీరితో ఉన్నాడు. ఇదియే భగవంతుని లీల. ఆ కొండ ఎట్లా క్రిందికి దింపాడు? భగవంతుడు ఒక్క క్షణములో ఏమైనా చేయవచ్చు.

**కదలదు నీదు సంకల్పము లేనిదె గడ్డిపోచయును**
**అదియునిదియు ననగనేల పిపీలికాది బ్రహ్మ పర్యంతము నీవె**
**అది ఎరుంగరు మది గలంగరు భువిని కొందరు**
**వివేకమున వర్తించెదమని కడు విఱ్ఱవీగెదరుగాని**
**చివరికేవేళ ఏమి సంభవించునో తెలియజాలరు ఎంతవారైనా.**

అదే భగవంతుని దివ్యశక్తిలోని ధర్మసూక్ష్మము. కేవలం బాహ్యదృష్టితో సామాన్య రూపమును మాత్రమే చూస్తూ దానియొక్క చేష్టలను మాత్రమే పరికించుచు భగవంతుడు మావలె జీవితాన్ని గడుపుతూ ఉన్నాడని భావిస్తుంటారు. చివరకు అదియే చాలా మోసం చేస్తుంది. అదే మానవత్వమును మరింత మూర్ఖములో ముంచుతుంది. 'దేహము మావలె

srisathyasai vachanamrutam

ఉంటున్నాది. మావలె తింటున్నాడు. మావలె తిరుగుతున్నాడు' అనుకుంటారు. కానీ తాను మావాడుకాదు. తాను తానే! ఈ విధమైన సత్యతత్త్వమును ఎవరు గ్రహిస్తారో అదియే నిజమైన విద్య.

**విద్య యొసగును వినయంబు**
**వినయమునను కల్గు పాత్రత**
**పాత్రతవలన ధనము**
**ధనమువల్లను ధర్మంబు**
**దానివల్లను ఐహిక ఆముష్మికముల పొందు నరుడు.**

కనుక, మొట్టమొదట గ్రహించవలసినది, చదువు ధనసంపాదనకోసంకాదు. 'విద్యాదదాతి వినయం' వినయములేని విద్య విద్యయేకాదు. వినయములేని విద్యార్థి విద్యార్థియేకాడు. అతను విషయార్థి. ఈ జగత్తునందు దైవత్వమును గుర్తించటం ఎవరికి సాధ్యంకాదు. ఎవడు జవదాటకుండా భగవంతుని ఆజ్ఞను శిరసావహించి దానికి బద్ధుడౌనో వాడే దివ్యత్వమును పరిపూర్ణముగా అనుభవించగలడు.

**అవతారతత్త్వమును అందరూ గ్రహించలేరు**

షిర్డీలో మహల్సాపతి నిరంతరము సాయిబాబాతో అదే రూములో నిద్రించేవాడు. ఒక చావడి ఉండేది. ఆ చావడిలో ఒక చిన్న కర్ర పలక కట్టుకొని ఆ పలకపై పవళించేవాడు, సాయిబాబా. ఆ పలక ఎంతో తెలుసునా? ఐదు ఇంచీలు మాత్రమే వెడల్పు. దానిపైన ఆజానుబాహుడైన సాయిబాబా నిద్రించేవాడు. ఆయన మంచి ఎత్తైన మనిషి. దానిక్రింద మహల్సాపతి పడుకునేవాడు. ప్రప్రథమంలో మహల్సాపతికి భయం ఏర్పడేది. ఆ పలకనుకూడా సాయిబాబా పాత పంచలు కట్టిపెట్టాడు దాన్ని క్రింద పడకుండా! ఎప్పుడు తెగుతాదో ఏమిటోనని మహల్సాపతి చాలా భయపడేవాడు. ఆతడు సన్నంగా ఉండేవాడు. అంత పెద్దమనిషి నా పై పడితే నేను బ్రతకగలనా అని భయపడిపోతున్నాడు. రాత్రంతా నిద్రపోయేవాడుకాదు. ఎక్కడ కొంచెం శబ్దమైనా పరగెత్తిపోయేవాడు. అయితే కడపటికి బాబా తన దైవత్వమును ఒక్క మహల్సాపతికి మాత్రమే నిరూపిస్తూవచ్చాడు. 'మహల్సాపతి!

లే!' అని పిల్చేవాడు. అప్పుడు బాబా 'చోటాభాయి' అని పిల్చేవాడు మహల్సాపతిని. ఒక రోజున మహల్సాపతి లేచి చూస్తే పాతపంచలుకూడా లేవు. ఒట్టి పలకమాత్రమే నిల్చి ఉంది గాలిలో! ఆ పలకపైన ఊయల మాదిరి ఊగుతున్నాడు, సాయిబాబా. 'నా బరువును ఆ పాతపంచ కాదు, మోసేది. నా శక్తియే నా దేహభారమును వహిస్తున్నాది'. అని తెలియజేసి 'మహల్సాపతీ! ఎవరికి నీవు చెప్పవద్దు. పత్రిలో కొందరు నేను బ్రహ్మణుడని, కొందరు మహమ్మదీయుడనని, మరికొంతమంది నేను పటేలునని యీ విధంగా రకరకాలుగా చెప్పుకుంటున్నారు. నిజానికి, నేను పత్రి గ్రామములోపల దేవగిరమ్మ, గంగాభవాద్యుడు అనే బ్రాహ్మణదంపతులకు పుట్టినవాడను', అని వెల్లడించాడు. అప్పుడే మహల్సాపతి బాబాను కీర్తిస్తూ ఇలా చెప్పాడు:

> **పత్రిగ్రామ సముద్భూతం ద్వారకామాయివాసినం**
> **భక్తాభీష్టప్రదం దేవం సాయినాథం నమామ్యహం**

ఈ మర్మము ఎవరికి చెప్పకూడదు, అని బాబా హెచ్చరించాడు. ఎందుకనగా ఆనాడు శిరిడిలో, అసలు మహారాష్ట్రలో హిందు, మహమ్మదీయులలో ద్వేషము ఏర్పడి ఒకరినొకరు హింసించుకోటం జరుగుతుండేది. కనుక తాను మహమ్మదీయులలో మహమ్మదీయుడని, హిందువులలో హిందువును అని బాబా చెప్పాడు. పైగా 'నన్ను హిందువని చెప్పవద్దు. మహమ్మదీయుడని చెప్పవద్దు' అని మహల్సాపతివద్ద మాట తీసుకున్నాడు. ఆ విధమైన కొన్ని రహస్యాలు ఎవరికో ఒకరిద్దరికి మాత్రమే చెబుతూ వచ్చాడు, బాబా. ఏ అవతారమందుకూడా భగవత్తత్త్వము అందరికి తెలిసేదికాదు. రామావతారమందు ఒక్క లక్ష్మణునికి తప్ప మరెవ్వరికి చెప్పలేదు, తన తత్త్వము. కారణము, లక్ష్మణుడు నిరంతరము రాముని వెంట, జంట, యింట, ఉండేవాడు. లక్ష్మణుని త్యాగము యిట్టిది, అట్టిది అని వర్ణించుటకు వీలుకాదు. గొప్ప రాజ్యము ఉంటున్నాది. తల్లితండ్రులుంటున్నారు. భార్యపిల్లలుంటున్నారు కానీ యివి నాకు అక్కరలేదు. నా రాముడు నాకు కావాలి. కనుక దేనినైనా త్యాగముచేసి నేను రామునితో వెడతాను అని సుమిత్ర దగ్గరకొచ్చి ప్రార్థించాడు. తల్లిపేరుకూడా ఎంతమంచి పేరు! సుమిత్ర అనగా మంచి స్నేహితురాలు అని. నమస్కారం



sri sathyasai vachanamrutam

చేసి లక్ష్మణుడు వెడుతుంటే 'నాయనా! రాములు ఉండిన అరణ్యమే నీకు అయోధ్య, రాముడులేని యీ అయోధ్యయే మాకు అరణ్యము' అనింది. 'రాములకు ఎట్టి అనానుకూలము కలుగకుండా ప్రవర్తించు నాయనా! రామునికి కించిత్తైనా మనస్సునందు బాధ కలగకుండా చూచుకో. అతనికి మనసులో ఏమైనా బాధ కలుగుతే ప్రపంచానికే బాధ కలుగుతుంది. ఎందుకంటే సర్వత్రా ఉండినవాడు భగవంతుడు. భగవంతుని మనసుకేమైనా కష్టం కలుగుతే ప్రపంచమునకే కష్టం కలుగుతుంది'. ఎంత చక్కని బోధ చేసింది సుమిత్ర!

**భక్తుడనేవాడు ఎట్టి మార్పులు, కూర్పులు లేని స్థితప్రజ్ఞుడై ఉండాలి**

కృష్ణావతారమందు బలరాముడు ఎప్పుడూ కృష్ణునివెంటనే ఉండేవాడు. కాని ఉద్ధవుడు మిత్రుడు. కృష్ణునికి పరమమిత్రుడు ఉద్ధవుడు. కృష్ణుడు ఎక్కడ ఉంటే అక్కడ బలరాముడు తోడుగా ఉండవచ్చుగానీ ఉద్ధవుడు నీడవలె వెన్నంటి ఉండేవాడు. కనుకనే కృష్ణుడు తాను దేహాన్ని వదలేపూర్వము ఉద్ధవుని మాత్రమే పిల్చి 'ఇదుగో యిప్పుడు యీ విధమైన అల్లర్లు ప్రారంభమవుతాయి. యాదవకులమందు ముసలం ప్రారంభమవుతుంది. నీవు మొట్టమొదట స్త్రీలనందరిని తీసుకొని హస్తినాపురం వెళ్లిపొమ్మ'న్నాడు. అందుకు ఉద్ధవుడు 'నేను పోను' అన్నాడు. 'నేను నీతోనే ఉంటాను' అన్నాడు. అప్పుడింక అతని ఒప్పించటానికి వీలుకాకపోయింది. అర్జునుని పిలచి నీవు వీరిని తీసుకొనిపోమని చెప్పాడు. ఎవరూ యిక్కడ ఉండకూడదు. యశోద, దేవకిదేవి, రుక్మిణి, సత్యభామ వీరందరిని తీసుకొని అర్జునుడు వచ్చాడు. ఉద్ధవుడు కృష్ణుని పాదాలు పట్టుకొని చెట్టుక్రింద కూర్చున్నాడు. 'ఉన్నంతవరకు నీతోనే ఉంటాను నీవు వెడితే నీతోనే వస్తాను. నీ ఎడబాటును నేను సహించుకోలేను', అని ప్రార్థించాడు ఉద్ధవుడు. అందువలన కృష్ణుడు తాను ఎప్పుడు దేహాన్ని వదలేది ఉద్ధవునికే చెప్పాడు. ఇటువంటి రహస్యములు దైవత్వములో ఎన్నియో ఉంటున్నవి. అత్యంత రహస్యమైనవి చాలా ఉంటున్నాయి. సూక్ష్మమైనవికూడా ఉంటుంటాయి. యిట్టి సూక్ష్మాతిసూక్ష్మమైనవి ప్రాణమిత్రునిగా ఉన్నవానికే చెవిలో వేయటం జరుగుతుంది. అందరికి చెప్పటానికి వీలుకాదు. దైవత్వము అనేది అందరికి ఏవిధంగా అర్థమవుతుంది?

sri sathyasaivachanamrutam

ఏవైనా అద్భుతములు చూచినప్పుడు 'అబ్బ! దైవము!' అంటారు. ఒక దినము, రెండు దినముల తర్వాత స్వామి సామాన్యమే! అది కలగకూడదు. ఎప్పటికి constant Integrated awarenessగా ఉంటుండాలి. ఎట్టి మార్పులు, కూర్పులులేని స్థితప్రజ్ఞుడై ఉంటుండాలి.

**విషయవాసనలు దూరము చేసుకుని విశ్వేశ్వర చింతనలో మునిగేవాడు స్థితప్రజ్ఞుడు**

భగవద్గీతలో స్థితప్రజ్ఞుని లక్షణాలు అనేక రీతులుగా వివరించుకుంటూ వచ్చారు. స్థితప్రజ్ఞుడంటే ఒక వివరణ ఏమంటే అందరికి పగలైనప్పుడు స్థితప్రజ్ఞునికి రాత్రిగా ఉంటుంది. అందరికి రాత్రి అయినప్పుడు స్థితప్రజ్ఞునికి పగలుగా ఉంటుంది. ఉదాహరణకు రైల్వేస్టేషను మాస్టరు రాత్రంతా మేలుకుంటాడు. చాలామంది ఘూర్ఖాలు రాత్రి మేలుకుంటారు. వారంతా స్థితప్రజ్ఞులేనా! అదికాదు స్థితప్రజ్ఞుడనగా జగత్ వ్యవహారమందు నిద్రపోతున్నవాడు భగవద్విషయములో మేలుకొని ఉంటాడు. చాలామంది జగద్వ్యవహారములలో చాలా జాగ్రత్తగా ఉంటారు. స్థితప్రజ్ఞుడు వాటిని మరచిపోతాడు. ఎల్లప్పుడు దివ్యమైన ఆనందములో మునిగి ఉంటాడు. అదీ స్థితప్రజ్ఞ లక్షణాలు. విషయవాసనలు దూరంచేసుకొని విశ్వేశ్వర చింతనలో మునిగేవాడు స్థితప్రజ్ఞుడు. కనుక, అట్టి స్థితప్రజ్ఞ లక్షణములను మానవుడు పొందాలని భగవద్గీత ప్రబోధిస్తూ వచ్చింది. లోకములో ఎన్ని విధములైన చర్యలో జరుగుతున్నాయి.

**జగత్తులో ఏదీ చెడ్డది లేదనే భావాన్ని హృదయములో నింపుకోవాలి**

భగవంతుని చర్యలందు సర్వము ఆనందమయమే! చెడ్డది అనేది ఒక్కటీ జగత్తులో లేదు. భగవంతుని సృష్టియే అంతా! భగవంతుని సృష్టి చెడ్డది అవుతుందా? నీవున్న స్థాయికి నీవున్న పరిస్థితికి నీకున్న తెలివితేటలకు 'మంచి, చెడ్డ' అని నిర్ణయించవచ్చు. కానీ, అన్నింటికి అతీతమైన స్థాయికి పోతే అంతా మంచిదే! చెడ్డదే లేదు, లోకములో! కాన, మనము జగత్తులో ఏదీ చెడ్డ లేదనే భావాన్ని మన హృదయములో నింపుకోవాలి. అయితే ఆ భావము వచ్చేంతవరకు మానవత్వమును సక్రమమైన మార్గములో ప్రవేశపెట్టాలి. మరొకటి ఉంటున్నది. అనేకమంది ధ్యానస్థితిలో మునిగిపోతుంటారు. దైవత్వము ఒక powerful current వంటిది. మనము 3 phase కరెంటు powerful అనుకుంటాం. భగవంతుడు,

srisathyasaivachanamrutam

దానికంటె అధికమైన powerful. ఒక చెడ్డ యింకొక మంచిలో ప్రవేశిస్తుంది. ఒక మంచి యింకొక చెడ్డలో ప్రవేశిస్తుంది. కనుక ధ్యానసమయమందు ఒక దేహానికి, మరొక దేహానికి సంబంధము ఉండకూడదు. నా ఉద్దేశ్యము మెడిటెషనే కాదు. ఎలాంటి పరిస్థితులలోనైనా యితరులను దేహభావముతో కలిసినప్పుడు వారిలో చెడ్డ భావములు కరెంటువలె వీనిలో ప్రవేశిస్తాయి. కనుక, సాధ్యమైనంతవరకు ప్రత్యేకంగా ఉండటం చాలా మంచిది. ఆ ఉద్దేశ్యముతోనే ఋషులందరు అరణ్యమునకు వెడుతూ వచ్చారు. దుర్భావములతో సంబంధము కల్గినప్పుడు ఆ దుర్భావములే మనలో వస్తాయి. సాధ్యమైనంతవరకు ఒకరికొకరికి సంబంధము లేకుండా ఒంటరిగా కొంతవరకు జీవించటము చాలా అవసరము. ఇదియే దైవరహస్యము.

**(తేదీ 23-08-1996న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam